

# డాక్టర్ చెప్పిన కథలు – డా.శైలజ చందు



## (ప్రారంభం)

ఎం. బి. బి. ఎస్ చివరి సంవత్సరంలో(1987 – 88 ), లాగ్ బుక్ పూర్తిచేయాలంటే, కొన్ని డెలివరీలు స్వంతంగా చేయాలి. మరి కొన్నింటికి అసిస్ట్ చేయాలి. అందుకోసమని లేబర్ రూం లో డ్యూటీలు చేసేవాళ్ళం. నేనూ నా వార్డ్ మేట్ వెంకట్, ఇద్దరం వంతులు వేసుకుని, రోజుమార్చి రోజు డ్యూటీలు చేస్తున్నాం. ఓ సారి మధ్యాహ్నం పూట కేంటీన్ లో ఏదో తిని వస్తుంటే...

"వణ్ణం తినవే, మళ్ళా లోపలికి తీసుకెల్తే ఉత్త నీళ్ళెక్కిస్తారు. తినూ.."

డెలివరీ రూం ఎదురుగా ఉన్న మర్రిచెట్టు చుట్టూ ఓ సిమెంట్ చప్టా కట్టారు. అక్కడ ఓ నిండు గర్భిణీ, ఆమె భర్తా కూర్చుని ఇద్దరూ అన్నం తింటున్నారు. ఎర్రటి పచ్చడన్నం.

ఆమె తినలేక అవస్థ పడుతోంది.

వాళ్ళను దాటి వచ్చి, మళ్ళీ వెనక్కి వెళ్ళాను.

"ఏంటి, ఇక్కడ కూర్చున్నారు?"

గబుక్కున చప్టా దూకి "సన్ననెప్పులే వత్తన్నాయని, కాసేపాగి రమ్మన్నారు. లోపల ఖాళీ లేదంట!"

" అన్నం పెట్టొద్దు. నొప్పులొస్తున్నప్పుడు, కడుపు ఖాళీగా ఉంటే మంచిది."

ముందుకెళ్తుంటే అంటున్నాడు.

"నేజెప్పలా, వణ్ణం తినకూడదంటా. ఇంకానయం , నాలుగు ముద్దలు తిన్నావు గాబట్టి సరిపోయింది. "

మధ్యాహ్నం మూడింటికో, నాలుగింటికో పెద్ద డాక్టర్లందరూ డ్యూటీ దిగివెళ్ళిపోయేవాళ్ళు. వెళ్ళబోయేముందు వచ్చాడు.

"మీరేటి శేస్తారో నాకేం తెలవదు. పోయిన సారీ కూతుర్నే కన్నది. ఇప్పుడికి ముదనష్టపు దేవర్లు ముగ్గురున్నారు. ఈ పాలి ఎట్లాగైనా మీ చేతి సలవ సూపియ్యాల. నాకు మగపిల్లగాణ్ణియ్యాల. మా వొంశం నిలబెట్టాల."

"అవును మహా వంశం" అంటూ నవ్వి, "మా చేతుల్లో ఏముందయ్యా. కడుపులోఎవరుంటే వాళ్ళు బయటికొస్తారు." అంది ఇలాంటివాళ్ళనెందర్నో చూసి చూసి రిటైరవ్వబోతున్న మా ప్రొఫెసర్.

"అట్టాంటే కుదర్దమ్మగారూ. నేను ఒంటిసేత్తో మూడెకరాలు సాగు సేస్తా. ఎకరాకు ముప్పై బస్తాలవుతది. రావయ్యగారి ఈరిగాడు, ఉట్టి సోంబేరు సన్నాసి. పజ్జెనిమిది పండిచ్చటాకి సెవట్లు కక్కుతాడు. అట్టాంటిది ఆడు ఒడ్లు పండిచ్చడం కాదురా, అంత సేటు మగోడివైతే ఒక్క మగపిల్లాణ్ణి కనమని పబ్లీకులో శాలెంజి శేశాడు. ఆడి దిమ్మతిరిగేట్టు ఇది మగపిల్లాణ్ణి కనాల, ఆడికి సీపెట్టాల."

మూర్ఖత్వానికి మూలస్థంభంలాగా నిల్చున్నాడు.

"పిచ్చివెధవా, నువ్వూ నీ చాదస్తమూ, మేమందరం ఆడవాళ్ళం కాదూ, మా అమ్మానాన్నలు నాదగ్గరే ఉంటార్రా. ఆడపిల్లలే చక్కగా చూస్తారు నిన్ను."

"అమ్మమ్మ, అంతమాటనవాకండి. సచ్చిపోతాను. ఈ పాలి పిలగాడు పుడతాడని ఆశగా ఉన్నాను. మొన్న వెంకన్న సావి కల్లో కనపడి ఒరే నీ ఇంటికొస్తా్నా అన్నాడమ్మగారూ."

"ఆయనకేం పనిలేదనుకున్నావా నీ గుడిసె చుట్టూ తిరగడానికి."

"ఇంటికాడ ముగ్గురున్నారమ్మా, కట్నాలు కానుకలు పురుళ్ళనీ ఎన్నుంటాయి. ఏడనుండి తెస్తాను సెప్పండి.మగోడైతే అంతా రాడవేగందా. "

"ఒరే , మళ్ళీ మగపిల్లాడని అన్నావో పాతిపెడతా,, ఫో అవతలకు. నాకు పనుంది."

"అమ్మా, మగపిల్లాడే పుట్టాలని గట్టిగా సావిని తల్చుకుని కాన్పు సెయ్యండమ్మా. అనుకున్నది అనుకున్నట్టు జరిగితే తల్నీలాలిస్తాననుకునానండీ" అంటూ పెద్ద నర్సుకు చెప్తున్నాడు.

"అవును మరి మహా నీలాలు. నీ పొలంలో నాట్లే వత్తుగా ఉంటాయేమో." పెద్ద నర్సు వెక్కిరించింది.

"ఏవేయ్, . ఈ సారి ఆడపిల్ల పుట్టిందో, నిన్ను ఈడనే ఒదిలేసెల్తా. ఈ జలమలో నీ మొకం సూడను. గేపకమెట్టుకో. రేపు పొస్టు బస్సుకొచ్చేత్తా."

వాళ్ళావిడకు ఓ హెచ్చరిక జారీ చేసి, పక్కనే నిల్చున్న మమ్మల్ని చూసి "అమ్మా సిన్నమ్మలూ , మా యాదది ప్రసవయ్యేప్పుడు మీరన్నా ఆ ఎంకన్నను తలుచుకోండి. అంతా ఆ సావే సూసుకుంటాడు." డెలివరీ టైం లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మాక్కూడా సూచనలు చేసివెళ్ళాడు.

నరసమ్మ, మొగుడి గురించి చెప్తూ ఎంత మంచివాడో, అంత మాయదారి సచ్చినోడనీ , అనుకున్నది జరక్కపోతే పిచ్చెక్కి, తిక్కరేగి ఆ తిక్కలో ఏదైనా చేయగల సమర్థుడనీ, అలాటి క్షణికావేశంలో చేసిన పనులవల్ల రెండు సార్లు జైలుక్కూడా పోయాడనీ వివరించింది. "ఆడపిల్ల పుడితే నన్ను సంపేస్తాడమ్మా" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

నరసమ్మకు అన్ని కాన్పులూ ఇంటి దగ్గరేనట. వెంకన్నగారిచ్చిన భరోసాతో ఈ సారి మగపిల్లాడు పుడతాడని, పుట్టగానే ఆపరేషన్ చేయించాలని హాస్పిటల్ కు తీసుకొచ్చాడు. ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయిస్తే అప్పుడు అయిదొందలిచ్చేవారు. ఓ స్టీలు బిందె కూడా ఫ్రీ!

అందరూ డ్యూటీ దిగి వెళ్ళబోతుంటే, ఓ పెద్దావిడ, కడుపుతో ఉన్న ఓ పదిహేనేళ్ళ అమ్మాయిని తీసుకొచ్చింది. ఆ పిల్లకు పెద్దమ్మ అవుతుందట.

వచ్చినావిడ మా ప్రొఫెసర్ టేబిల్ మీద వంగి ఏదో చెప్తోంది. పెద్దనర్సును పిల్చి మేడం ఏదో చెప్పారు.

అరగంట పాటు జరిగిన ఆ రహస్య చర్చల సారాంశం ఏమిటంటే, ఆ అమ్మాయికి పెళ్ళికాలేదు. పుట్టిన బిడ్డను , పిల్లల్లేని ఓ జంట తీసుకునే ఏర్పాట్లు చేశారు..

ఆ అమ్మాయికి పదిహేనేళ్ళుంటాయేమో. మ్యూజియం లో వింతవస్తువు నడుచుకుంటూ డెలివరీ రూం లో బెంచీ మీద కూర్చున్నట్లు , మేమందరం ఆమెనే చూస్తున్నాం.

బాగా ముతక లంగా కట్టుకుంది. సగానికి చింపిన నేత చీర, ఓణీ లాగా వేసుకుంది. లూజుగా ఉన్న జాకెట్టు. వెంట తెచ్చుకున్న మాసిన దుప్పటి కప్పుకుని కూర్చుంది. భయమూ , కంగారూ కలిసిన చూపులు. మొహం లో వత్తుగా అమాయకత్వం. గర్భిణీ కావడం వల్ల

నునుపు దేరిన నల్లటి బుగ్గలు . రెండు జడలు వేసుకుని పైకి కట్టి పసుప్పచ్చ రిబ్బన్లు వేసుకుంది. నెప్పులొస్తున్నాయేమో మొహం మీద చిరు చెమటలు.

“ఎవరే?” అంటూ కొందరు ఎంక్వైరీ చెయ్యబోయారు.

దాన్ని ఎవరూ ఏమడగొద్దని గట్టిగా చెప్పి మా ప్రొఫెసర్ వాళ్ళను ఆపేసింది.

అందరూ వెళ్ళిపోయారు. సాయంత్రం అయింది.

***

అర్థ రాత్రి రెండయింది. ఓ పిల్ల నర్సు. నేను.

కాన్పు కష్టమైతే సహాయం చెయ్యడానికి, అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి పీజీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చాలా దగ్గర్లోనే డ్యూటీరూముల్లో ఉంటారు కాబట్టి మేము పెద్దగా భయపడేవాళ్ళం కాదు. సాధ్యమైనంతవరకూ తేలిక కాన్పులన్నీ మామీదే వదిలేసేవాళ్ళు.

ఒక టేబిల్ మీద నరసమ్మ.

ఆమె పక్కనే లేత గర్భిణీ. నొప్పులు తట్టుకోలేకపోతోంది.

బాగా నొప్పివచ్చినప్పుడల్లా, తన దుప్పటి అదీ సరి చేసుకుని “నేనెల్లిపోతా” అంటూ టేబిల్ మీద నుండి లేచెళ్ళబోతోంది.

నరసమ్మ తన టేబిల్ దిగి ఆపిల్ల పక్కనే నిల్చుని వెన్ను రాస్తోంది. ఓర్చుకోమని ఏదో చెప్తోంది.

"బాగా గాలి పీల్సుకో! అయిపోద్దిలే, నీరు పడిపోయిందా, ముక్కాలనిపిస్తే ముక్కు" నరసమ్మ. అనుభవంతో చెప్తోంది.

సాధారణంగా నా అంతట నేను పేషంట్లతో దురుసుగా మాట్లాడడానికి ఇష్టపడను.

‘ఆవిడ వ్యాపారం ఆవిణ్ణి చూసుకోమని, కాస్త నిశ్శబ్దంగా ఉండమని’ ఇంగ్లీషులో నర్సుతో చెప్పి, తెలుగులో నరసమ్మకు చెప్పమన్నాను.

"ఏవమ్మో, నోర్మూసుకో, నువ్వేమైనా డాక్టరనుకుంటన్నావా" పిల్లనర్సు స్వేచ్ఛానువాదం చేసింది

"పాపం పిల్ల తట్టుకోలేకపోతందనీ"

"అక్కా, సచ్చిపోయేట్టున్నానక్కా"

"వెంకన్నను తల్సుకో, కన్నుమూసి కన్ను తెరిసేలోగా అయిపోద్ది"

ఆ జూనియర్ గర్భిణీ కి ముందు డెలివరీ అయిపోయింది. మగపిల్లవాడు. నాలుగైదు జన్మలకు సరిపడా విరక్తీ, నీరసమూ కమ్ముకోగా, ఎవరు పుట్టారో కూడా అడక్కుండా ఓ పక్కకు తిరిగి పడుకొంది.

నాతో ఉన్న నర్సుకు కొన్ని అద్భుత శక్తులున్నాయి. హఠాత్తుగా మాయమై , మళ్ళీ అంతే హఠాత్తుగా ప్రత్యక్షమవుతుండేది. . ఎక్కడికెళ్ళావని ఆ యక్షరహస్యాలు కనుక్కునే ప్రయత్నం చేయకూడదు. నరసమ్మ డెలివరీ అయిపోగానే అలా మాయమైంది.

అసలు హీరోయిన్ డెలివరీ దగ్గరౌతున్నకొద్దీ, నా గుండె వేగం పెరుగుతోంది. ఒక్కోనొప్పికి పది పాయింట్లచొప్పున గుండె రేటు పెరుగుతోంది.

ఆడపిల్లపుడితే నరసమ్మ మొగుడుగారు ఏం గోలచేస్తారో ఏవిటో? టెన్షన్ పెరిగిపోతోంది. ‘ మగపిల్లాడే పుడితే బాగుండు దేవుడా! అదే గనక జరిగితే ...’అంటూ ఆవేశపడబోతుండగా,

“నీ బొంద, నీకెందుకు ఎవరికెవరు పుడితే? అసలే ఆయన స్ట్రిక్ట్. మొక్కు తీర్చకపోతే ఏదో ఒక పరీక్షలో, అక్కణ్ణుంచే మనకు గుండు కొట్టిస్తాడు.’ మనసు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.

బిడ్డ తాలూకు తల, భుజాలు చేతులు, పొట్ట ...మెల్లగా జారుతోంది.

మరుసటి రోజు పుదయాన్నే అభిమాన హీరో కొత్త సిన్మా రిలీజవుతుంటే, ముందు రాత్రి కరుడుగట్టిన అభిమాని వలె రెస్ట్ లెస్ అయిపోతున్నాను.

బొడ్డుతాడు క్లాంప్ చేసి కట్ చేసి చూస్తే......

వెంకన్న బదులు వెంకమ్మ. నేను భయపడినట్లూ, మీరూహించినట్లూ ఆడపిల్లే పుట్టింది. పిల్ల తొందరగానే ఏడ్చింది.

దేవుడా, ఇదేంటి అనుకుంటూ, కంగారు కంగారుగా పక్కకు తీసుకెళ్ళి ఒక ఉయ్యాల్లో పడుకోబెట్టాను.

నరసమ్మ నేను చేసే ప్రతి పనీ వెయ్యికళ్ళతో చూస్తోంది.

“అమ్మా మగబిడ్డా? ఆడబిడ్డా?”

నరసమ్మకు ప్రసవానుభవం, ఉన్నందువల్ల, “ఏందమ్మో, ఆడపిల్లగొంతులా వినొస్తందీ. అమ్మా డాట్టరమ్మా, నీకు పున్నెవుంటది. ఆడపిల్లో మగపిల్లోడో తొందరగా సెప్పమ్మా.” నేను ప్లాసెంటా తీస్తుంటే నరసమ్మ నా ప్రాణాలు తీస్తోంది.

డెలివరీ కాగానే, సెలైన్ లో కలపాల్సిన ఇంజెక్షన్లు కలిపేసి, చేతికో ఇంజెక్షన్ చేశాను. నర్సెటో పోయింది.

“ఒక్కదాన్ని ఎన్నని చేస్తాను. కాసేపు ఊరుకో” ఇంకో దారిలేక కసురుకున్నాను. మొహమంతా కోపంగా పెట్టుకుని ఎంతో పనున్నట్లు అటూ ఇటూ పరుగులు తీస్తున్నాను. నా కోపం చూసి మాట్లాడడానికి వెనకాడింది.

సహాయానికి ఎవరినైనా పిలవొచ్చు కానీ, ఎందుకో పిలవబుద్ధికాలేదు. బయటికెళ్ళిచూస్తే, ఆయమ్మలు బాత్ రూం గోడకానుకుని కూర్చునే నిద్ర పోతున్నారు.

కాసేపు లావాటి రిజిస్టర్ దగ్గర నిల్చున్నాను. డెలివరీ అయిన వెంటనే వివరాలు అక్కడ ఎంటర్ చెయ్యాలి. ఫిమేల్ బేబీ అని రాయబోయి ఆగాను.

తమకేబిడ్డో, నరసమ్మకూ తెలియదు, పదిహేనేళ్ళ అమ్మాయికీ తెలియదు. ఆ అమ్మాయికి ఏ బిడ్డైనా ఒకటే. ఎవరికో పెంపకానికి వెళ్ళిపోతుంది. ఆమెకు పుట్టిన మగబిడ్డను నరసమ్మకిచ్చేస్తే... .

గోడకానుకుని ఓ క్షణం ఆలోచించాను.

ఇద్దరు జంటల్నీ మనసులో తలుచుకున్నాను. రంగులూ అవీ పెద్దగా తేడాగా ఏం లేరు.

నా చేతిలో పని. అందరూ హాయిగా ఉంటారు.

మార్చేస్తే !? దుర్మార్గమైన ఆలోచన వచ్చింది.

హాస్పిటల్ అంతా నిద్రలో ఉంది. దూరంగా లైట్ల వెలుగులో ఊగే వేపచెట్లు, ఎక్కడో ఆకాశంలో చందమామ. మార్చేస్తే అందరి బతుకులూ హాయిగా ఉంటాయి.

దొంగ పని చెయ్యాలంటే కావల్సింది ఏకాంతం కాదు, గుండె ధైర్యమని తెలిసి లోపలికి వచ్చేశాను.

ఆ పిల్ల కన్న మగపిల్లవాడు ఓ పక్కన ఉయ్యాల్లో మొద్దునిద్రపోతున్నాడు. నరసమ్మ కూతురు మాత్రం కీ కీ అని ఏడ్చి, లైట్లవంక చూస్తోంది.

నరసమ్మ దగ్గరకెళ్ళి, “నరసమ్మా, నా మాట విను , ఆడపిల్ల మగపిల్లవాడా అనే విషయం అసలు ఎవరిచేతిలోనూ ఉండదు. ఆడపిల్లలు కూడా .. “ పొంతన లేని మాటలు మాట్లాడుతున్నా.

వెంటనే పిచ్చి పట్టినదానిలా, “ఏటీ మళ్ళా ఆడపిల్లా ? దేవుడా నన్ను తీసుకెళ్ళు దేవుడా. నేను బతకను. ఆడు నన్ను సంపేత్తాడు. నాకొద్దీ పిల్ల. ఈ మాయదారిముండ నన్ను సంపటాకే పుట్టింది. దాన్ని తీసుకెళ్ళి గోడవతల ఇసిరేస్తా. పిల్ల పుట్టగానే సచ్చిపోయిందని సెప్పండి.”

ఈ గొడవెరగని పిల్ల, చుట్టిఉన్న గుడ్డను కాసేపు, అవి అందనపుడు గుప్పిళ్ళు కాసేపు చీకుతోంది.

“ఊరుకో నరసమ్మా , గొడవచెయ్యకు ప్లీజ్.” బతిమలాడుతున్నాను.

“ఎట్టా ఊరుకోను. తెల్లారితే నా కొంప కూలిపోద్ది. ఆడొచ్చి నన్నే సంపేస్తాడో ఇద్దర్నీ సంపేస్తాడో తెల్వదు. సద్దావంటే ఇంటికాడపిల్లలకి దిక్కెవరు. దేవుడా ఇంత అన్యాయవా. సంపెయ్యి డాట్టరమ్మా దాన్ని, లేపోతే నేనే సంపేస్తా.” అంటూ పూనకం వచ్చినదాన్లా లేస్తోంది.

ఆ గొడవకు పక్కనే మగపిల్లాణ్ణి కన్న అమ్మాయి నిద్రలేచింది.

“అక్కా” అంటూ లేచి టేబిల్ మీద బాసెంపెట్లు వేసుకుని నరసమ్మ వంక చూస్తోంది.

“ఏయ్! పడుకో” అని ఆ పిల్లను కసిరాను

“ఇంతన్యాయం సేసావేంట్రా దేవుడా దేవుడా” అంటూ ఏడ్చి ఏడ్చి ఓపిక లేక వెక్కిళ్ళు పడుతోంది.

నర్సొచ్చి వార్డ్ లో పేషంట్ కు బెడ్ మీదే డెలివరీ అయిందని చెప్తే, ఆ విషయం చూసేందుకు అటెళ్ళాను. ఆ పనీ, వార్డ్ లో ఇంజెక్షన్లపనీ అదీ ఇదీ అయేసరికి తెల్లారిపోయింది.

ఆత్రగాడైన మా వెంకట్ ఆ రోజు కేసులకోసం వలతో పాటు వచ్చేస్తూ ఉంటాడు. అనుకున్నట్లే ఏడున్నరకు చద్దన్నం తినేసి, పాండ్స్ పౌడర్ సౌజన్యంతో తెల్లగా తయారయి వచ్చేశాడు.

అమ్మో ఇతగాడొచ్చాడంటే, పస్ట్ బస్సులో అతగాడూ వస్తాడు. ఎంతగొడవచేస్తాడో.

“నేను వెళ్తాను వెంకట్ , రెండు డెలివరీలయ్యాయి. ఇదొకటి. డిటైల్స్ రిజిస్టర్ లో ఎక్కిస్తావా ప్లీజ్?” అన్నాను.

“సర్లే నువ్వెళ్ళు నే రాస్తాలే” అన్నాడు.

ఇంటికెళ్ళాను. రాత్రంతా నిద్రలేకపోయినా నిద్రరాలేదు. నిద్రపోడానికి ప్రయత్నిస్తుంటే, ఒకటే కలలు. అర్థం పర్థం లేని కలలు. పక్కింటివాళ్ళు నా బెడ్ పక్కనే బట్టలు ఉతుకుతున్నారు. ఎవరో డబ్బాలు, గిన్నెలు, తపేళాలు నా నెత్తిమీద వేస్తున్నారు. దాహం వేస్తోంది. నీళ్ళకోసం ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటే మెలకువ వచ్చింది. వంటింట్లో బిందెలో నీళ్ళు ముంచుకుని తాగాను. వేడిగా ఉన్నాయి.

వెంటనే రాత్రి కేసులు గుర్తొచ్చాయి. నరసమ్మ మొగుడు ఏం గొడవ చేశాడో?

సునామీ ని ఆపే మంత్రం తెలిసి కూడా జపించలేదనీ మనసు నిష్టూరాలు వేస్తోంది.

ఆ రోజు ఎలాగో అయిందనిపించాను. ఆ తర్వాత రోజు నాదే. కేసుల కోసం వెళ్ళాల్సిన రోజు.

ఉదయాన్నే వెళ్ళాను. వార్డ్ హడావుడిగా ఉంది. నరసమ్మకు ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్ అని థియేటర్ లోపలికి తీసుకెళ్తున్నారు. తలంతా ఒకటే నొప్పి. కాఫీ తాగితే పోతుందేమోనని బయటికొచ్చి కేంటీన్ కెళ్ళి తిరిగి వస్తుంటే బయట నరసమ్మ భర్త గారు మర్రిచెట్టు సిమెంటు చప్టా మీద కూర్చుని సుఖంగా బీడీపానం చేస్తున్నారు.

నన్ను చూసి పులిలా మీద బడతాడేమోనన్న భయంతో ఎటో చూస్తూ, పోతున్నాను.

"అమ్మా, డాట్టరమ్మా, నిన్నే, నిన్నే" అంటూ వెంటబడుతున్నాడు.

'ఓరినాయనో' స్పీడు పెంచాను.

పంచె ఓ చేత్తో పైకి పట్టుకుని పరుగున వచ్చి నాతో కలిశాడు.

"ఏంటీ?" రౌడీలను ఎదుర్కొనే విజయశాంతి కంఠంతో అడిగాను.

"మగబిడ్డ పుట్టాడు. అంతా నీ సేతి సలవ. మా వొంశం నిలబెట్టావు." అని ప్రాంప్టింగ్ అందని నాటకపాత్రధారిలా ఏదేదో వాగుతున్నాడు.

"ఇదుంచు. ఇంతకన్నా ఏవిచ్చుకోలేను" అంటూ 20 రూపాయలనోటు చేతిలో పెట్టాడు.

'మగబిడ్డా? '

ఏంటిది. ఏదో తేడా వుందీ అనుకుంటూ, ఆ ఇరవై రూపాయలనోటు అతనికిచ్చేయాలనే ఆలోచనకూడా లేకుండా అది చేతిలో ఉంచుకునే వార్డ్ లోపలకు పరిగెత్తాను.

నరసమ్మకు చిటికెలో ఆపరేషన్ అయింది కాబట్టి వార్డ్ లో మూలుగుతూ పడుకుని ఉంది.

"నరసమ్మా, నరసమ్మా, ఓ మాట చెప్పు." అంటే కళ్ళు విప్పి నా వొంక చూసి, పొద్దున్నే గుడ్ల గూబను చూసిన ఎక్స్ప్రెషన్ ఇచ్చి కళ్ళుమూసుకుని, మూలగడంలో బిజీ అయిపోయింది.

"అదికాదు నరసమ్మా, నీకు ఎవరుపుట్టారో తెలుసా?" నేనడుగుతుంటే ఆమెకు నొప్పి ఎక్కువవుతోంది.

నరసమ్మకు ఆడపిల్లకదా! వెంకట్ రిజిస్టర్ లో తప్పకుండా రాసే ఉంటాడు.

పరుగున వెళ్ళబోతుంటే ఎవరో ఆపారు. మగబిడ్డను కన్న ఆ పిల్ల గర్భిణీ.

"సిట్టరూ, మాట "

నన్నెవరైనా సిస్టర్ అని పిలిస్తే చచ్చేట్లు చీవాట్లు పెట్టేదాన్ని. వాళ్ళకు డాక్టర్ అన్న పదం నేర్పి, నన్ను డాక్టర్ అనిపిలిచేదాకా వదిలేదాన్నికాదు.

విచిత్రంగా ఆ నిముషంలో కోపమే రాలేదు.

"నువ్వెల్లిపోయాక, పిలగాణ్ణి అక్కని తీసుకోమన్నా. ఎవురూ సూడలా. నువ్వూ సెప్పమాక ." అంటూ నా చేతిలో తను ఒట్టువేస్తోంది.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments